(అష్టోత్తర శత నామాంచిత అష్టోత్తర శతచ్ఛంద)

రాఘవ శతకము

రచన

చింతా రామకృష్ణారావు

అష్టోత్తర శతనామాంచిత అష్టోత్తర శతచ్ఛంద

రాఘవ శతకము

రచన

చింతా రామకృష్ణారావు

2024

రాఘవ శతకము

(Raghava Satakamu)

రచన

చింతా రామకృష్ణారావు

ప్రథమ ముద్రణ	:	మార్చ్, 2025
ప్రతులు	:	300
వెల	:	₹ 100

ప్రాప్తిస్థానం	:	**చింతా రామకృష్ణారావు.** ఫ్లాట్ నెంబర్. A 601 శిల్పాస్ ఆర్వీ ధర్మిష్ఠా, డీ మార్ట్ ఎదురుగా, శ్రీరంగపురం కాలనీ, మియాపూర్. హైదరాబాదు - 500049 ఫోన్. 8247384165.

డి టి పి &	:	**మాచవోలు శ్రీధరరావు (9441833788),**
కవర్ డిజైన్	:	
ముద్రణ	:	**కర్షక్ ప్రింటర్స్, విద్యానగర్, హైదరాబాద్.**

'వాగ్విదాంవర'
నారుమంచి వేంకట అనంతకృష్ణ
హైదరాబాదు



ఓంశ్రీరామాయనమః.
శ్రీరామ నీనామ మెంతో రుచిరా

శ్రీ చింతా రామకృష్ణారావుగారు అన్నది ప్రతి క్రొత్తకవి కళ్ళలో కనిపించే ఒకదివ్యమైన మెరుపు. నిరహంకారము, సహనము, సహాయశీలత, అల్పసంతోషము వంటి అనేకసద్గుణాలు ఒకచోట కలబోసి చూస్తే మా చింతాఅన్నగారౌతారు. వీరి పద్యరచన ఆశువేగముతో సాగుతుంది. 24 గంటలు, అంతకన్నా తక్కువ సమయములో శతకములు వ్రాయడములోను, ఆశువుగా చిత్ర, బంధ, కవిత్వము వెలయించుటలోను అందెవేసిన చేయివారిది.

ఇక ప్రకృతములో శ్రీరామ అష్టోత్తర శతనామావళి గర్భితముగా, అష్టోత్తర శతభిన్న వృత్తములలో 'రాఘవా' మకుటముతో శతకమును వ్రాసినారు. రామాష్టోత్తర శతనామావళిలోని ప్రతినామాంకితముగా ఒకపద్యము వ్రాయాలి, మకుటము గురు+లఘు+గురువులు కనుక చివర రగణమున్న వృత్తములనే ఎన్నుకోవాలి. ఆయా నామాక్షరాలకు సరిపడు గణప్రస్తారముతో పాదాంతము రగణము ఉండేటటువంటి వృత్తములను మాత్రమే ఎన్నుకోవాలి. ఇలా స్వీయ నిబంధనల క్లిష్టతఉన్నప్పటికీ అమ్మదయతో ఆశువేగముతో శతకము పూర్తిచేసారు. అలాగే నాబోంట్లకు పాఠము లాగా వృత్తనామము, లక్షణము కూడా పద్యాదిలో పొందుపరిచారు. అలాంటి చక్కని శతకానికి ఈనాలుగుమాటలు వ్రాసే అదృష్టం నాకుదక్కడం అమ్మదయ, వారివాత్సల్యము కారణము.

శ్రీమన్మంగళ దేవదేవ అని మగణారంభ పద్యముతో శతకము మొదలౌతుంది. ఆలంకారికులు, ఛందోహృదయ మెఱిగినవారు మగణారంభమునకు పెక్కు వైశిష్ట్యములు చెప్పినారు. ఇక పద్యభావము చూద్దాం. రామమార్గగాములకు, రామచరిత్ర చదువు వారికి, శ్రీరామభక్తులకు,

ఈ మంత్రాక్షర బద్ధమైన పద్యాలు రామతేజముగానే గోచరిస్తాయిట. అంటే ప్రతి పద్యమునకు మంత్రవ్యాఖ్యస్థాయిని సంకల్పించి వ్రాయబడిన శతకమిది. క్రమముగా వ్రాయకున్నను వాల్మీకములోని ముఖ్యఘట్టములన్ని పద్యభావములై వెలసినవి. ఒకవిధముగా ఇది సంక్షిప్త రామాయణము వంటిదనవచ్చునేమో.

మరొక విశేషము. సమవృత్తములు, విషమవృత్తములు అని రెండు రకములు. విషమవృత్తములలో సాధారణముగా సరిపాదములు ఒక విధముగా, బేసిపాదములు ఒకవి ధముగా ఉంటాయి. అయితే ఇక్కడ కొన్ని వృత్తములలో ప్రతిపాదము భిన్నగణములు, భిన్న యతిస్థానములతో వ్రాయబడుట వినూత్న ప్రయోగము. ఉదాహరణముగా (11), (58), (75) పద్యములు చూడగలరు.

ఈ శతకములోని మరొక విశేషమేమిటంటే సంబోధనలు. రామవైభవ సారముగా అనేక సంబోధనలను చింతావారు కల్పించారు. ఇవే మరొక అష్టోత్తరము కన్నా ఎక్కువ నామాలనే అందిస్తాయి. ఒక విధముగా 'రామత్రిశతి' అనవచ్చునేమో.

ఇలా మొత్తం శతకహృదయము చూసినట్లైతే స్వార్థరహిత ప్రార్థనలు, లోకహితైషికత ద్యోతక మౌతాయి. వృత్తములు పఠనములో కాఠిన్య మేమాత్రము లేనివి, లయాత్మకమైన నడకతో హృద్యముగా ఉన్నవి. చింతావారు తాము చేసిన అనేక వినూత్న ప్రక్రియలవలె ఇదియునూ మరొక వినూత్న ప్రయోగమును సఫలతతో నిర్వహించి మాబోంట్లకు మార్గదర్శనము చేసినారు. వారి పద్యసేద్యము నిర్విరామముగా సాగాలని, దానికి వలయు ఆయురారోగ్య భాగ్యములను అమ్మ ప్రసాదించాలని ప్రార్థిస్తూ... స్వస్తి.

గురుపాదధూళి

నారుమంచివేంకటఅనంతకృష్ణ.

భాగ్యనగరము.

05 - 5 - 2024.

అవధాన భారతి, సాహితీ చతురానన, ఛందో వైవిధ్య నిష్ణాత,
ఛందస్సవ్యసాచి, స్వర్ణకంకణ, కవి గండపెండేర సత్కార
గ్రహీత,
విద్వాన్ చక్రాల లక్ష్మీకాంత రాజారావు, ఎం.ఏ.,
విశ్రాంత సంస్కృతాంధ్రోపన్యాసకులు.
హైదరాబాద్, చరవాణి – 9291333880

ఛందోభారతీ నమోఽస్తుతే

ఆధునిక కవీశ్వరులను – వారి కావ్య రచనలను పరిశీలింపగా నానా ఛందస్స్వర్ణ భూషా లంకృతయై శ్రీ భారతీదేవి – ఆంధ్ర భాషా సాహితీ రంగస్థలమందు కరకమలములతో కచ్ఛపీ వీణానాదము చేయుచు పాఠక లోకమును అలరింపఁ జేయుచున్నట్లు కనిపించుచున్నది. పద్య సాహితీ రంగమందు ఛందోఽమ్మమందునూహించని యొక క్రొత్త మార్పు.

ఇరువది ముప్పది వృత్తములతో పద్యకావ్యము లల్లిన ప్రాచీన కవీశ్వరుల పోకడలకు _ వేలాది ఛందములు గైకొని రమణీయమైన కావ్యములు వ్రాయుచున్న ఆధునిక కవుల పోకడలకు భేదము గమనించగా– వారి వారి ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసములందు – గురువుల బోధనలందు– కాలగమనమ్మునందు – అభి మానించెడు పాఠకుల జిజ్ఞాస యందు – పట్టుదలలందు – కృషి యందు – ఆలోచనా విధానములందు – పెను మార్పులు రావడ మొక కారణముగా కనిపించుచున్నది. నేటి కవుల మధ్య నేదో తెలియని పోటీతనము, తమకున్నప్రతిభా సంపత్తిని అనేకానేక కావ్యరచనలతో తెలుఁగువారికి తెలియ జేయాలనే ఆకాంక్ష – అందునా వివిధములైన ఛందములతో వ్రాయాలనే తపన, అజరామరమయిన కీర్తిని పొందాలనే ఆశ – యున్నట్లు తోచుచున్నది. ఇట్టి ఆలోచన ప్రశంసనీయమేకదా.

ఇంతటి యుపోద్ఘాతమేలనగా– నేటి తెలుఁగు కవుల యాలోచనలు – వారి కావ్యరచనలు – పాఠకుల సాహిత్యాభిమానము – కావ్యముద్రణకు నార్థిక సహాయమందించుటకు తమవంతుగా ముందుకు వచ్చుచున్న వ్యక్తులు – వీరి బంధాలు– అనుబంధాలు చూచి ఆనందించు వారిలో నేనుండడమే.

పద్యమునకు కాలము చెల్లిందని పలుకు నీ తరములో ఇలా వివిధరీతులగు ఛందములందు కావ్యములు రచించి పద్యభారతీ పాదపద్మారాధకులుగా అనేకులగు కవులు దర్శనమీయడము- తెలుఁగు జాతి ఆదరించడము ముదావహమగు విషయము.

ఈ విధముగా పద్యమునకు జీవమునిచ్చి, ఆంధ్ర భాషా వాఙ్మయరంగాన వివిధచ్ఛందములలో పద్య కావ్యరచన చేయుచున్న కవీశ్వరులలో నాకు తెలిసిన వారిలో శ్రీ చింతా రామకృష్ణ రావు గారొకరు. వీరు సంస్కృతాంధ్ర భాషా విశారదులు. సహృదయులు . వీరు పద్యకావ్యరచనలను జేయుచు జై మాతృకులగు కవులను ప్రోత్సహించుచు - వారిచేత కావ్యరచనలు చేయించి నిరంతరము భాషాభి వృద్ధికి తమవంతు కృషి చేయుచున్నారు.

శ్రీ చింతా వారి అష్టోత్తరశతఛంద■ రాఘవశతకమును చదివితిని. ఇందు ప్రతిపద్యమున మకుటము "రాఘవా" అను శుభప్రద పదము. మరియు ప్రతి పద్యమున శ్రీరామనామ ములందుండు శ్రీరామస్తుతి పదమొకటి. ఇలా రెంటికి సరిపడు వృత్తచ్ఛందమును పద్యచ్ఛందో దర్శిని మందు పరిశీలనము చేసి- ఆవృత్తమున——దైవస్తుతినిగానీ, సామాజికాంశమునుగాని అనుసంధానము చేసి వ్రాయుటలో కవిగారెంతటిశ్రమనుఓరిమినిచూపినారో పద్యము వ్రాసిన తరువాత నెంతటి ఆనందమును పొందినారో నేనునూహించగలను.

పద్య రచనకు సరియగు భావసంపద దొరికినచో వీరి లేఖని పరుగులు దీయును, చిత్ర కవిత్వము నందు, గర్భ కవిత్వము నందు, నన్నివిధములగు గద్య, పద్య, గేయ, కథారచనలందు వీరు చేయి తిరిగిన వారగుటచే_ ఎవరైనను - ఏవిశేషాంశమునందైననూ, ఎటు వంటి ప్రక్రియయందైనను - రచింపుడని శ్రీ చింతా వారిని అడుగుటయే తడవు _ వీరు ఆనందముతో నంగీకరించి - వారడిగినట్టుల రచించి గడువులోపల నందించగలరు. అంతటిమృదు మధుర కావ్యకర్తలు, భాషాభిజ్ఞులు వీరు. ఇట్టి సాహితీ సంపత్తి గలవారగుటచే ఆధునిక కవిపండితులలో తలలోని నాల్కగా నిలిచినారు.

వీరు తమ శతకారంభమందు నాందీపద్యముగా శ్రీకారముతో ప్రారంభించి - కావ్యలక్షణములందు ముఖ్యమగు "విశ్వశ్రేయః కావ్యమ్" అను

దివ్యోక్తికి ప్రథమ తాంబూలమందించినారు. నాటి అప్పకవీయాది ఛ్ఛంద శ్శాస్త్రగ్రంథములను నేటి అనంతచ్ఛంద మను బృహత్తర ఛందశ్శాస్త్ర గ్రంథమును పరిశీలించి - అందుగలవృత్త ములలో శ్రీరామనామములకు పనికివచ్చు వృత్తములను అష్టోత్తరశతములను గ్రహించి ఎంతో శ్రమించి, భక్తిరసమును రంగరించి, ఒక భక్తిశతకముగా, నేటి సామాజికాంశములను కావ్య వస్తువుగా స్వీకరించి, కరుణ రసమును చిలుకరించి – ఒక సామాజికాంశశతకముగా వీరు రచించినారు.

విభూతి, కౌముది, చారుహాసికి, నాగరము, మంజరి, మనోరమ - వంటి వివిధ ఛ్ఛందోవృత్తములతో శతకరచన చేసి – శ్రీ చింతావారు – ఛందః పండితులచేత నతులు నుతులు అందుకొన్నారు.

పద్యసాహితీ రంగాన వాడుకలో నున్న పద్యములను గాయకులు, నటులు పాడగా మనము వింటున్నాము, విని ఆనందించుచున్నాము. మరి - యిలా - క్రొత్తగా వచ్చిన పద్యములను మనము మనకు ననుకూలమయిన రాగములో పాడుకొని _ ఆనందించి - ఆదివ్యానందమును అందరికీ పంచు యత్నము చేయాలి. అపుడే మిగులు పద్యములకు - వ్రాసిన కవులకు- నామసహిత కీర్తి కాంతులు - తెలుఁగు భాషా సరస్వతికి నవ్యదివ్య హారతుల కాంతులు. అట్టి ప్రయత్నం చేసి కాబోయే ఛందః కవులకు ఇలా వ్రాయుచున్నశ్రీ చింతా రామకృష్ణారావు వంటి కవులకు ప్రోత్సాహమందిద్దాం.

కం॥ ఇంతింతగ ఛందములన్
భ్రాంతిన్ గొని వ్రాసినట్టి పండిత కవికిన్,
చింతావారికి వాణీ
కాంతామణి వాసి, రాశి, కలిగించు లలిన్.

ఇట్లు,
బుధజనవిధేయుఁడు
చక్రాల లక్ష్మీకాంత రాజారావు
హైదరాబాదు,
06 - 5 - 2024.

'సమస్యా పృచ్ఛక చక్రవర్తి', 'పద్యవశంకర'
కంది శంకరయ్య
వరంగల్

అభినందన పద్య పంచకము

కం॥ శ్రీరఘురాముని నామ సు
ధారస పానమ్ముఁ జేసి తన్మయులై మీ
రీ రాఘవ శతకమ్మును
కోరి లిఖించితిరి జనులకున్ మోదమిడన్.

కం॥ ఛందోవైవిధ్యముతో
సుందరపదబంధములు విశుద్ధ మనమునన్
సందడి సేయఁగ మధురా
స్పందముగా వ్రాసినట్టి సత్కవి! ప్రణతుల్.

కం॥ ఆటాడి ఛందములతో
వాటముగా నాశుగతినిఁ బద్యమ్ములలో
మేటిగ రాఘవు మహిమల
నోటు వడక చెప్పి జనుల కొసఁగితిరి కదా!

కం॥ రైలెక్కి దిగెడి లోపల
వాలాయమ్ముగ శతకము వ్రాసితిరట! నే
నే లీల మిమ్ముఁ బొగడుదు
శ్రీలలితాకృపను గాంచి చెలఁగెడి సుకవీ!

కం॥ ఎనలేని గర్భకవితా
ఘనతను గుర్తించి చిత్ర కవితా సమ్రా
ట్టనుచుం గవిపండితు ల
ల్లను మెత్తురు మీదు కావ్యమాధురిఁ గనుచున్.

కంది శంకరయ్య
06 – 5 – 2024.

ఈ శతక రచనకు ప్రేరేపించిన మహనీయులు భాగవత గణనాధ్యాయి బ్రహ్మశ్రీ ఊలపల్లి సాంబశివరావుగారి అభిప్రాయము.

ఆంధ్రభాష సంస్కారవంతమైనభాష. సంస్కృతపదములను తత్సమములుగ గ్రహించి బహు పరిపుష్టమైన భాష. “దేశభాషలందు తెలుగు లెస్స” అని ఆంధ్ర భోజునిగా, కన్నడరాజ్య రమారమణగా కీర్తించబడిన శ్రీ కృష్ణదేవరాయలు అంతని వారిచే ప్రశంసింపబడిన భాష. భారతీయభాషల్లో అచ్చుతో అంతమవుతు కమనీయంగా శ్రవణపేయంగా ఉండే భాషమనఆంధ్రభాష. సంగీత సాహిత్యాలలో మహోన్నతుడైన రవీంద్ర నాథ టాగూరుచేత ఇది ప్రసంగమా సంగీత గానమా అని పొగడబడినది.

పద్య, చంపూ, వచన, ద్వ్యర్థి, త్ర్యర్థి వంటి కవిత్వాలతో, దండకాలు, శతకాలు, టుమ్రీలు, గేయాలు, పాటలు, భజనలు, నాటకాలు, కథలు, కథానికలు, కవితలు, నవలలు వంటి అనేక వివిధ ప్రక్రియలతో విలసిల్లే అద్భుతమైనది మన తెలుగుభాష. సంస్కృతం, ఆంగ్ల, తమిళం, వంటి జాతీయ అంతర్జాతీయ భాషల నుండి అనంతమైన అనువాదములు గ్రహించే ఔన్నత్యం గలది మన మాతృభాష.

ఇందు ఛందోబద్ధమైన కవితా శైలులలో పద్య రచన ఒకటి. మన ఛందశ్శాస్త్రానుసారంగా యతి ప్రాసలను జయప్రదంగా శుభప్రదంగా సాగుతున్నది తెలుగు పద్యం. తెలుగు పద్యరచన ఆకర్షణ తరాలు ఎన్ని గడచినా తరగదు. సాధారణంగా వాడే చంపకమాలాది ఛందస్సులే కాకుండా ఎన్ని రకాల ఛందస్సులు మన తెలుగులో వాడారో తేల్చాలంటే అబ్బో పెద్ద పరిశోధనాత్మక యత్నం కావాలి.

ఛందోబద్ధరచనలలో బహుళ ఆకర్షణీయమైనది శతక రచన. పద్యాలు వ్రాయడంలో చెయ్యి తిరిగిందంటే చాలు శతకం వ్రాసేద్దామని మనసులాగుతుందిట. అలా అనంతమైన శతకాలు వచ్చాయి. అందు విశిష్టమైనవి ప్రసిద్ధమైనవి వేమన శతకం, సుమతీ శతకం, దాశరథీ శతకం, కుమారీ శతకం, కుమార శతకం, నారాయణ శతకం వంటివనేకం ఉన్నాయి.

శతక ప్రక్రియలో నూటికి పైగా పద్యాలు ఉంటాయి. సాధారణంగా శతకానికి మకుటం ఉండడం, తప్పనిసరి నియమం కాక పోయినా, మకుటాయమానంగా కనబడుతుంటుంది. ఆ మకుటాన్ని బట్టి ఏక ఛందస్సు వాడడము లేదా అనేక ఛందస్సులు వాడడం ఉన్నది.

అయితే మన చింతా రామకృష్ణ కవి చిత్రకవిత్వ ఆశు కవిత్వాలు చెప్పడంలో దిట్ట. అవధాని. “చిత్రకవితాసమ్రాట్, కవికల్పభూజ, పద్యకవితాభిరామ, చిత్రకవితాసహస్రఫణీ, పుంభావభారతీ” ఇత్యాదిబిరుదాంకితులు. వీరు ఈ శతకంలో సంప్రదాయబద్ధముగా “శ్రీ” తో ఆరంభించారు. బావుంది. రఘురాముడు శార్దూల పరాక్రముడు కనుక వృత్తం “శార్దూల విక్రీడితం” తో మొదలుపెట్టారు. శ్రీరాముడు మంగళకరుడు కనుక ముందర “శ్రీమన్మంగళ” అని ప్రారంభించారు. రఘురాముడు కనుక “రాఘవా” మకుటంగా గ్రహించారు. చూసారా వారి విశిష్ఠత. ‘మగణము’ రామ. శ్రీరామ అష్టోత్తర శతనామావళిలోని నూటెనిమిది నామాలకు క్రమంగా ఒక పద్యం. ప్రతిపద్యం వేరే ఛందోవృత్తం, అనగా నూటెనిమిది పద్యాలకు నూటెనిమిది ఛందో ప్రక్రియలు. పాదానికి మూడు గణములు (అక్షరములు) నుండి ఇరవై ఆరు గణములు (అక్షరములు) ఉండే వివిధ ఛందస్సులు ఉపయోగించారు. వీరు నిగర్వి, నిత్యసంతోషి. స్నేహశీలి, సహృదయులు.

ఇంతటి విశిష్టతలతో అలరారుతున్న శోభాయమానమైన ఈశతకమునకు రసజ్ఞుల ఆదరాభిమానాలు ఉండక ఎట్లుండును?

పాఠక మహాశయులారా దీనిని హాయిగా ఆస్వాదించండి. ధన్యవాదములు.

~భాగవత గణనాధ్యాయి.

ఆత్మ నివేదన

శ్రీమన్మంగళ స్వరూపిణి శ్రీలలితాంబ కృపావిశేషంబున సుప్రసిద్ధ భాగవత గణనాధ్యాయి బ్రహ్మశ్రీ ఊలపల్లి సాంబశివరావు సహృదయులు దూరవాణిలో నన్నుపలుకరించి, నాచే రచింపఁబడిన శ్రీరామునిపై శతకముంటే పంపమనికోరిరి. నేను సరే అని పలికి సంభాషణ ముగించిన పిదప నేను ఆలోచించుకొంటిని. నేను ఇంతవరకు శ్రీరామునకు సంబంధించి రామాన్వయ కంద సీతాన్వయ గీతగర్భ హనుమదన్వయ సుందరఉత్పల నక్షత్రమాల(సుందరకాండ) మాత్రమే రచించి యున్నందున, గణనాధ్యాయి కోరిన శతకము ఇంతవరకు నాచే రచింపఁ బడనందున, వారికి నాపైగల, ఆరామునిపై గల విశ్వాసము వొమ్మవకుండా చేయుటకు వారు కోరిన శతకమును వ్రాసి యిచ్చిన సరిపోవును కదా అని భావించి యుంటిని.

ఇంతలో సమస్యాపృచ్ఛక చక్రవర్తి శ్రీకంది శంకరయ్య గారు నాతో చరవాణిలో మాటాడుచూ శృంగేరిలో చిరంజీవి లలితాదిత్య శతావధానానికి వెళ్ళుతున్నాంకదా, అందుకని నేను ఆశృంగేరి శారదాంబ అష్టోత్తర శతనామములు పాదాది నుంచి అష్టోత్తర శతఛందములలో శారదా శతకమును వ్రాయ దలచుకొని ముందుగా మీకు చెప్పుచున్నాను, ఎందువలననగా మీరు లలితాసహస్రమును, లక్ష్మీసహస్రమును, శ్రీనృసింహ అష్టోత్తర శతనామములను పద్యములలో రచించి యుండిరి. అదియే నాకు ప్రేరణ అని తన మనోగతమును తెలిపి యున్నారు. అలా అంటూ మీరు మాత్రము శారదపై వ్రాసెయ్యకండి అన్నారు. ఆమాట నాలో ఆలోచనను రేపింది. రామునిపై శతకము వ్రాయవలసి యున్నది కదా, నేనును కందివారు చెప్పినట్లు శారదాంబపై కాక రామునిపై వ్రాసిన గణనాధ్యాయి కోరిక తీర్చినట్లవుతుంది అని భావించి శ్రీ కందివారికి తెలియఁ జేశాను. చాలా మంచి ఆలోచన. తప్పక వ్రాయండి అన్నారు. కందివారు శారదా! అను మకుటమును స్వీకరించగా నేను రాఘవా! అనే మకుటాన్ని ఎంచుకున్నాను. రగణము అంతమందుండే వృత్తములను అప్పకవీయము నుండి, ఇతర ఛందో గ్రంథముల నుండి, అనంతచ్ఛందము నుండి గ్రహించి రచన కుపక్రమించితిని. ఆ లలితాంబ దయ అపారమైనది. ఆ శ్రీరాముఁడు దయాంతరంగుఁడు. నా ప్రయత్నము వ్యర్థముకాకుండా నేను కోరుకొనిన విధముగా శతకమును వారము దినములలో నాచేవ్రాయఁజేసిరి.

ఈ శతకావిర్భావమునకు ప్రేరణ, పూరణ అన్నియు అమ్మవారే. ఒక పదినామములకు మాత్రము అవి ఇమిడెడి వృత్తములు నేను గ్రహించలేక పోవుటచే, కందివారిని, సహోదరులు బ్రహ్మశ్రీ తోపెల్ల బాలసుబ్రహ్మణ్యశర్మ గారిని అడిగితిని. వారి అనంతఛందము నుండి కొన్ని ఛందములను సూచించినంతనే ఆపది పద్యములునూ పూరించుట జరిగినది. శ్రీ కంది శంకరయ్యగారు నేను పరస్పరము ప్రోత్సహించుకొంటూ వారు శారదా శతకము, నేను రాఘవా శతకము వారము రోజుల వ్యవధిలో వ్రాయుటజరిగినది.

అనంతచ్ఛంద నిర్మాత శ్రీ తోపెల్ల సహోదరులకు, నిరంతరము ప్రోత్సహిస్తూ తమ అమూల్యమయిన అభిప్రాయము వ్రాసిన శ్రీ కంది శంకరయ్యగారికి నా ధన్యవాదములు. ఈసృష్టి అంతయూ అమ్మయే అని నిరంతరము అమ్మ ధ్యానమగ్నులై యుండు నాసహోదరులు చిరంజీవి నారుమంచి వేంకట అనంతకృష్ణ అమూల్యమయిన అభిప్రాయమును వ్రాసి నాకు ఆనందప్రదులైరి. వారికి అమ్మ ఆశీస్సులను అర్థిస్తున్నాను. బ్రహ్మశ్రీ చక్రాల రాజారావు మహోదయులకు పరిశీలనార్థం యీ రాఘవా శతకము పంపగా వారు ఆద్యంతము పరిశీలించి అక్కడక్కడ అవసరమయిన మార్పులకు సూచనలు చేసి తమ అమూల్యమయిన అభిప్రాయమును వ్రాసి దీవించి యుండిరి. వారికి నా హృదయ పూర్వక నమశ్శతములు తెలియఁ జేసుకొంటున్నాను.

శ్రీమాన్వైద్యం వేంకటేశ్వరాచార్యులవారు నాశతకమును పంపగనే అది చదివి అభిమానంతో వారు తమ సంతోషాన్ని వ్యక్తంచేస్తూ ప్రోత్సహించారు. వారికి నాధన్యవాదములు తెలియఁజేసుకొంటున్నాను. ముఖ్యముగా శతకమును వ్రాయుటకు ప్రేరణ కలిగించిన బ్రహ్మశ్రీ ఊలపల్లి సాంబశివరావు మహోదయ దంపతులకు నాప్రణామములు తెలియఁజేసుకొంటున్నాను.

బుధజనవిధేయుఁడు,

చింతారామకృష్ణారావు.

06 - 5 - 2024.

శ్రీరామ

అష్టోత్తరశత రాఘవనామాంచిత అష్టోత్తరశతచ్ఛంద రాఘవశతకము

వినాయక ప్రార్థన.

శా. శ్రీమన్మంగళ విఘ్ననాయక జయశ్రీకారకా! కోరిరా
ప్రేమన్ సాంబశివాఖ్యు భాగవతులే విఖ్యాత శ్రీ రాఘవున్
నీమంబొప్ప శతాధికంబయిన శాంతిన్ గొల్పు నామాళితోన్
బ్రేమన్ వ్రాయఁగ సంస్తుతించుచును, నే నీ దీవనన్ వ్రాసెదన్.

సరస్వతీ ప్రార్థన.

శా. అమ్మా! భారతి! లోకమాత! దయతో నాలింపు నా ప్రార్థనల్,
నెమ్మిన్ నే నిను సంస్మరించి రఘురాణ్నిత్యున్ శతాధిక్యమౌ
కమ్మన్ దేనియ పద్య లేఖనకు శ్రీకారంబునే జుట్టగా,
నిమ్మా యానతి, నీదు సత్ కృపను నే నీ కార్యమున్ జేసెదన్.

గురు ప్రార్థన.

శా. శ్రీమద్వేంకట వీర రాఘవ గురున్, శ్రీ కల్వపూడిప్రభన్,
నీమంబొప్పగ సంస్తుతింతు, రచనా నిర్మాణ కార్యంబునన్
ధీమంతుల్ గను దివ్యమార్గమున దేదీప్యంపు సద్వైఖరిన్
బ్రేమన్ గొల్పగ వేడుచున్, జయకరున్, విశ్వాసపూర్ణుండనై.

జననీజనకుల ప్రార్థన.

మ. సదయన్ జూడగ తండ్రిగారయిన శ్రీ సన్యాసరామాఖ్యునిన్,
యెదలో వేంకట రత్నమాంబ జననిన్, హృద్యంబుగాఁ గొల్చెదన్,
పదిలంబౌ తగు దారిలో నడిపి నన్ వర్ధిల్లఁగా జేసినా
రిది నాభాగ్యము, సత్కవీంద్రునిగ నేడీ ధాత్రిపై నిల్చితిన్.

సహృదయకవిపండితుల ప్రస్తుతి.

చ. సదయులు పండితోత్తములు చక్కగ మంచి రహింపఁ జేయుటన్,
మదిని దలంచి వారలకు మన్ననతోఁ బ్రణుతింతు భక్తితోఁ,
బదనగు సత్కవీంద్రులను బ్రస్తుతిఁ జేసి నమస్కరించెదన్,
మదులను నన్నుఁ బ్రేమఁ గను మాన్యులకెల్లరకున్ బ్రణామముల్.

జై శ్రీరామ

రాఘవ శతకము

1. ఓం శ్రీరామాయనమః.

శార్దూలవిక్రీడితవృత్తము. (మ స జ స జ త త గ / యతి - 13)

శ్రీమన్మంగళ దేవదేవ! శుభదా! ★శ్రీరామ!★ సన్మంగళం
బౌ మాన్యంబగు నీదు మార్గచరులౌ భద్రాత్ములౌవారికిన్,
ప్రేమన్ నీసుచరిత్రపాఠకులకున్, శ్రీరామ భక్తాళికిన్,
నీ మంత్రాక్షర నామ పద్యములనన్ నీ తేజమే రాఘవా!

2. ఓంరామభద్రాయ నమః.

సుగంధివృత్తము. 7 హగణములు ఒక గురువు/ యతి - 9.

{అరిశక్వరి.(ర జ ర జ ర / యతి - 9)}

సౌమ్యరూప! సుస్వభావ సారమీవె చూడగా,
గమ్యమేది మాకు? చూపు కావు భద్రతప్రదా!
సామ్యమెన్న లేదు నీకు సన్నుతాత్మ సంస్తుతుల్,
రమ్య సద్గుణప్రదుండ! ★రామభద్ర!★ రాఘవా!

3. ఓంరామచంద్రాయ నమః.

విభూతి వృత్తము. (ర జ గ)

★రామచంద్ర!★ తాటకన్
నేమమొప్ప కూల్చితే!
నీ మనోజ్ఞ జన్మమే
కామదంబు. రాఘవా!

4. ఓం శాశ్వతాయ నమః.

ఉత్సుక వృత్తము. (భ భ ర)

శ్రీకరమై భువి చెల్లు ని
క్ష్వాకకులప్రభ! ★శాశ్వతా!★
నీకిల సాటిఁక నీవె, ధీ
రా! కమలాక్షుఁడ! రాఘవా!

5. ఓం రాజీవలోచనాయ నమః .

నారాచ వృత్తము. (త ర వ)

★రాజీవలోచనా!★ హరీ!
స్త్రీజాతిఁ గావుమా భువిన్
పూజింత్రు భక్తితో నినున్
రాజీవె కావ, రాఘవా!

6. ఓం శ్రీమతేనమః .

కౌముది వృత్తము. (న త త గ/ యతి – 6)

ధరణి ★శ్రీమంత!★ నిన్ గొల్చినన్
నిరుపమా! శాంతి కల్గున్ గదా,
శరణమన్నన్ జయప్రాప్తియౌ
వరద! రక్షింపవా రాఘవా!

7. ఓం రాజేంద్రాయ నమః .

అంగజాస్త్రము.

(1, 2 పాదములకు భ మ స గ / యతి – 6,
3, 4 పాదములకు మ స జ గ / యతి – 6)

వ్రాసిరి ★రాజేంద్రా!★ కవులెన్నో
భూషగ కావ్యంబుల్ తగ నీ పై
ధ్యాసన్నే శతధా రచింపగా
నాసన్ బూనితినయ్య రాఘవా!

8. ఓం రఘుపుంగవాయ నమః .

అపరాజిత వృత్తము. (న న ర స వ / యతి - 9)

అగణిత ★రఘుపుంగవా!★ యసురాంతకా!
సుగుణులనిలఁ బ్రోచుచున్ గను దైవమా!
ప్రగణిత గుణ మీయవా, సురపూజితా!
నిగమవిదిత! పావనీ నుత రాఘవా!

9. ఓం జానకీవల్లభాయ నమః .

నదీప్రఘోషము.

(1వ పాదమున స్రగ్విణి- ర ర ర ర / యతి - 7
2వ పాదమున వంశస్థ- జ త జ ర / యతి - 8
3వ పాదమున భుజంగప్రయాత- య య య య / యతి - 8
4వ పాదమున ఇంద్రవంశ- త త జ ర / యతి - 8)

★జానకీ వల్లభా!★ సత్యవాక్యప్రియా!
మనంబు నీపైననె మన్ననంబునన్
ఘనంగా వరంబున్ రమానాథ! యిమ్మా!
జ్ఞానంబుతోఁ గొల్తు, నగణ్య! రాఘవా!

10. ఓం జైత్రాయ నమః.

క్షమ, (క్షప) వృత్తము. (న న త త గ / యతి - 8)

కనితివి శబరిన్ కన్నులన్ ★జైత్ర!★ ని
ల్పి నిజ మరయ నీవే కృపన్ ముక్తినే
ఘనముగనిడి, లోకాన నీవే ఘనం
బనగనిలిచినావా! హరీ! రాఘవా!

11. ఓం జితామిత్రాయ నమః.

చారుహాసికి , (ప్రవర్తిక- పరాంతిక).

(1వ పాదమున- న న ర వ / యతి - 6,
2వ పాదమున- స భ ర వ / యతి - 7,
3వ పాదమున- న ర జ గ/ యతి - 5,
4వ పాదమున స ర ర వ / యతి - 6)

భజన చలుప నేరనయ్య నే
నిజమెన్నన్, గననిమ్ము నిన్ సదా,
సృజననిచ్చి కావుమయ్య! రా
మ! ★జితామిత్ర!★ మన్నించు రాఘవా!

12. ఓం జనార్దనాయ నమః.

కదంబ మంజరీ వృత్తము. (జ ర ర జ జ గ / యతి - 9)

★జనార్దనా!★ దురాత్ముల్ ప్రజా విరోధులు, దుష్కృతుల్
పొనర్చుచుండిరే, యో ప్రభూ! క్షమించక వారలన్
మనంబు పెట్టి చంపన్, సమస్తమున్ శుభమౌనుగా,
ప్రణామ మీకు సంహారివై రహించుము రాఘవా!

13. ఓం విశ్వామిత్రప్రియాయ నమః .

హరిణి వృత్తము. (న న మ ర స లగ / యతి - 10)

ధరణిజ పతి! ★విశ్వామిత్రప్రియా!★ సుగుణాకరా!
వరమునిజన వంద్యా! దేవా! ప్రభాకరవంశజా!
పరమ పురుష! కావన్ రావా ననున్? గణియింపుచున్,
నిరుపముండ! పరంధామా నీవెకావుమ, రాఘవా!

14. ఓం దాంతాయ నమః .

ప్రమాణి వృత్తము. (జ ర వ)

మురారి! ★దాంత!★ నీ కృపన్
ధరాతలంబునందునన్
చరించు సజ్జనాళికిన్
వరించు మేలు రాఘవా!

15. ఓం శరణత్రాణ తత్పరాయ నమః.

రసోదత వృత్తము. (త జ భ త ర / యతి - 7)

రామా! ననుఁ గావరా, ★శరణత్రాణ తత్పరా!★
కామాదులు వీడఁ గాంచుము, రక్షించు నన్నిలన్,
శ్రీమంతుఁడ! నాదు చిత్తమునందుండి ప్రోవుమా,
ప్రేమాంబుధి! భవ్య విత్తము నీవేను, రాఘవా!

16. ఓం వాలిప్రమథనాయ నమః .

భుజంగవిజృంభిత వృత్తము.

(మ మ త న న న ర స వ / యతి – 9, 19)

పాపాత్ముండౌ వాలిన్ ★వాలిప్రమథన!★ తునిమి శుభమువర్ధిలన్ బొనరించితే?
శ్రీ పద్మాక్షుండా! నీ వాడన్, శ్రితజన వరదుఁడ! ననుఁ జేయనీ శుభకృత్యముల్,
నీపై ప్రేమన్ భక్తిన్, సమ్మానితముగ నొసగుమ, హరి! నెమ్మితో, దయఁ జూడుమా!
ప్రాపై నీవున్నంతన్ జీవింపఁగ భయమును మది విడు, భక్తి నిల్పుచు, రాఘవా!

17. ఓం వాఙ్మినే నమః .

నాగర వృత్తము. (భ ర వ)

రాముఁడ! ★వాఙ్మి!★ వాగ్ఝరిన్,
బ్రేమగ నాకుఁ నీయుమా,
నా మదిలోన నుండుమా
నీ మది నిల్పి, రాఘవా!

18. ఓం సత్యవాచేనమః .

వల్లరి వృత్తము. (ర ర)

★సత్యవాచా!★ రమా
స్తుత్య సద్బాంధవా!
నిత్యమున్ గొల్తు నిన్
భృత్యుఁడన్ రాఘవా!

19. ఓం సత్యవిక్రమాయ నమః.

ఇంద్రవంశ వృత్తము. (త త జ ర / యతి – 8)

సత్యంబు పాలింపగ ★సత్యవిక్రమా!★
నిత్యంబు నీవుంటివి నిర్మలప్రభన్,
స్తుత్యంబుగా కొల్చెద సుందరాంగ! యౌ
న్నత్యంబుతో నిల్పుమ నన్ను రాఘవా!

20. ఓం సత్యవ్రతాయ నమః.

మంజరి వృత్తము. (స జ స య లగ / యతి – 9)

పరమాత్ముఁడా! కన నుపాయమున్ దెల్పుమా
నిరతంబు నిన్, మదిని నిల్ప, ★సత్యవ్రతా!★
పరమంబునే గనఁగ వచ్చు, నిన్ జూచినన్,
సరిలేరునీ కిలను సన్నుతా! రాఘవా!

21.ఓం వ్రతధరాయ నమః.

సుధాధామ వృత్తము. (న త గ)

★వ్రతధరా!★ కాచితే
నుతి నహల్యా సతిన్,
బ్రతుకు పండించితే
నతులు శ్రీ రాఘవా!

22. ఓం సదా హనుమదాశ్రితాయ నమః.

ప్రియంవద వృత్తము. (న భ జ ర / యతి – 8)

★హనుమదాశ్రిత!★ సురార్చితా! హరీ!
నిను నుతింతును వినీలదేహుఁడా!
క్షణము లోపలనె కంటికానుమా,
ఘనతరంబుగను గణ్య రాఘవా!

23. ఓం కౌసలేయాయ నమః.

ద్రుతవిలంబిత వృత్తము. (న భ భ ర / యతి – 7)

ప్రణవ రూపుఁడ! భాగ్యద! ★కౌసలే
యే!★ నిను నామదినాశగ నిల్పెదన్,
గనుము నిచ్చలు కమ్మని ప్రేమతో,
వినుమ నామొర ప్రీతిని రాఘవా!

24. ఓం ఖరధ్వంసినే నమః.

మృత్యుంజయ వృత్తము. (త మ లగ)

దేవా! ★ఖరధ్వంసీ!★ హరీ!
భావంబులో నీవుండుమా,
జీవాత్మ వీవే కాంచగా,
గోవిందుఁడా! మా రాఘవా!

25. ఓం విరాధవధపండితాయ నమః.

చంపకమాల వృత్తము. (న జ భ జ జ జ ర / యతి – 11)

ప్రవరుఁడవౌ ★విరాధ వధపండిత!★ నీకు నమస్కరించెదన్,
శ్రవణకుతూహలంబగును శ్రావ్యపు నీ చరితంబు దేవరా!
భవములుపాపువాఁడవని భవ్యుఁడ నమ్మితిమయ్యనీవె మా
జవమునుసత్వమున్, నిజము, సాకుముమమ్మిలరామ! రాఘవా!

26. ఓం విభీషణ పరిత్రాత్రే నమః.

మత్తేభ వృత్తము. (స భ ర న మ య వ / యతి – 14)

కుమతిన్ రావణు సంహరించితివి, నీకున్ సాటి లేరంచనన్.
రమణుండా! ఘనుఁడా! ★విభీషణ పరిత్రాతా!★ జగద్రక్షకా!
రమసీతమ్మను కాచి తెచ్చితివి, నన్ రక్షించగా రావ? నే
మముతోనిన్నుతియింతుపద్యములలోమాన్యుండ! శ్రీ రాఘవా!

27. ఓం హరకోదండ ఖండనాయ నమః.

ఉపమాలిని వృత్తము. (న న త భ ర / యతి – 9)

సుగుణ గణుఁడ! దీవించు నన్నుఁ గృపాబ్ధి! నీ
డగనిలు ★హరకోదండ ఖండన!★ నిత్యమున్,
నిగమ విదిత దేవా! నినున్, మదినెంచెదన్,
జగము నడుపు వాడా! జయంబిడు రాఘవా!

28. ఓం సప్తతాళప్రభేత్రే నమః.

గౌరీ వృత్తము. (న న ర ర / యతి – 8)

పరమపురుష! ★సప్తతాళప్రభే
త!★ రమణ! కన నూత మీవే కదా,
స్థిరవర గుణ రాశి నిమ్మీవె నీ
స్మరణ విడువ శ్రీశ! మా రాఘవా!

29. ఓం దశగ్రీవశిరోహరాయ నమః.

కరపల్లవోద్రతా వృత్తము. .. (య య స జ గ. యతి 7.)

వరాత్మా!★దశగ్రీవశిరోహరా!★ పరా
త్పరా! దివ్య సద్భావ! సుపూజ్య! దేవరా!
పరంబీవె దివ్యా! పరమార్థమిమ్ము,నే
వరంబేమికోరన్! వరలంగ రాఘవా!

30. ఓం జామదగ్న్య మహాదర్పదలనాయ నమః.

దర్పనాశిని వృత్తము. (న ర స భ స వ / యతి – 10)

ధరణి ★జామదగ్న్య మహాదర్పదలన!★ శ్రీహరీ!
స్మరణ వీడనయ్య! మహేశా! కరుణను చూడుమా,
పరమ వీరరాఘవ! నా బంధమునిఁక పాపరా,
నిరుపమాన రాముఁడ! సాన్నిధ్యము నిడు, రాఘవా!

31. ఓం తాటకాంతకాయ నమః.

మనోరమ వృత్తము. (న ర జ గ/ యతి – 7)

తలఁప ★తాటకాంతకా!★ నినున్
ఖలురు పోదురే గతించుచున్
సులలితాత్ముఁడా! శుభంబులన్
గలుగఁ జేయుమింక రాఘవా!

32. ఓం వేదాంతసారాయ నమః.

కుటజగతి వృత్తము. (న జ మ త గ / యతి - 9)

అహరహమున్ నినున్ దేవా! ★వేదాంతసా
ర!★ హరి! స్మరించుచో ధారాపాతంబుగా
మహిమముతోడ, ఛందోమార్గంబందునన్
బహువిధపద్యముల్, తా వచ్చున్ రాఘవా!

33. ఓం వేదాత్మనే నమః.

లత వృత్తము. (ర య లగ)

శ్రీకరుండ! ★వేదాత్మ!★ నే
లోకమందు శోధించినన్
నాకుఁ దోచు నీ రూపమే,
లోకరక్ష! శ్రీ రాఘవా!

34. ఓం భవరోగస్యభేషజాయ నమః.

రథోద్ధత వృత్తము.(ర న ర వ / యతి - 7)

ప్రోవరావ, ★భవరోగభేషజా!★
నీవెకావనలె నిర్మలాత్ముఁడా!
జీవమీవె కద, చిత్ స్వరూపుడా!
రావణాంతక విరామ! రాఘవా!

35. ఓం దూషణత్రిశిరోహంత్రే నమః.

కుంజ వృత్తము. (త జ ర స ర. యతి 9)

నా దైవము నీవ, ★దూషణత్రిశిరోహంత!★ నా
మీదన్ దయఁ జూపి, నన్నుమేలుకొనంగన్ హరీ!
మోదంబునఁ జేయుమో సుపూజ్యుఁడ!శ్రీ రాముఁడా!
వేదాత్మవు, శ్రీశ! విశ్వవేద్యుఁడ! మా రాఘవా!

36. ఓం త్రిమూర్తయే నమః .

చంద్రిక,(భద్రిక) వృత్తము. (న న ర వ / యతి - 9)

అజుఁడు శివుఁడు నీవెరా! ధరన్
సుజననుత! ★త్రిమూర్తి!★ సుందరా!
నిజ ప్రతిభను జూపు నిత్యుఁడా!
ప్రజల మదుల లోని రాఘవా!

37. ఓం త్రిగుణాత్మకాయ నమః.

ఉత్పలమాల వృత్తము. (భ ర న భ భ ర వ / యతి - 10)

ఓ★త్రిగుణాత్మకా!★ శుభమహోజ్జ్వలతేజక! వందనంబు,మా
లో త్రిగుణంబులుండెను, విలోకనచేయుచునిల్పు సత్వమున్,
స్తోత్రముచేసి మ్రొక్కెదను సుందరపద్యములందు నిన్ను నా
యాత్రము నెన్ని కావుము మహాత్ముఁడ! పెన్నిధివైన రాఘవా!

38. ఓం త్రివిక్రమాయై నమః.

కరశయాకిశోర వృత్తము. (న భ ర)

కృపను గాంచు ★త్రివిక్రమా!★
యపజయంబులు బాపరా,
యుపవసింతును నిత్యమున్
ప్రపవు, నీదరి రాఘవా!

39. ఓం త్రిలోకాత్మనే నమః.

కుసుమిత వృత్తము. (న ర ర)

కనుమయా! ★త్రిలోకాత్మ!★ నన్,
వినుమయా ప్రభాపూర్ణమౌ
ఘనుఁడ! నీ ప్రభావంబునే
వినుతులందు నో రాఘవా!

40. ఓం పుణ్యచారిత్రకీర్తనాయ నమః.

పృథ్వి వృత్తము. (జ స జ స య లగ / యతి -12)

మునీశ్వరులు నిన్ను గొల్చుదురు ★పుణ్యచారిత్ర కీ
ర్తనా!★ నిను రమేశ! నేనును నితాంతమారాధనన్
గణించి, మదిఁ జేయుదున్, సుగుణగణ్యుఁడా! చూడవా?
మనంబుననుదల్పవా? కనవ మన్ననన్? రాఘవా!

41. ఓం త్రిలోక రక్షకాయ నమః.

చంపకకేసరి వృత్తము. (స జ స స స వ / యతి - 9)

సుకవుల్ నినున్ సతము శోభిలఁ బల్కు ★త్రిలోక ర
క్షక!★ గణ్యులా కవులు, కామితముల్ నెరవేరు వా
రికి, నీ కృపన్ సతము తృప్తిగనుందురు, కర్మలన్
సకలంబుపాపుమయ, సన్నుతు చేసెద రాఘవా!

42. ఓం ధన్వినే నమః.

మనోహర వృత్తము. (ర జ ర జ గ / యతి - 9)

రామ! ★ధన్వి!★ చూడవయ్య రాక్షసాంతకా!
ప్రేమతోడఁ గొల్తు నిన్ను విశ్వసించుచున్,
భూమిపైన వేదసార వేద్యులుండిరే,
నీమమొప్పకావుమయ్య నీవె, రాఘవా!

43. దండకారణ్యకర్తనాయ నమః.

కళాధర వృత్తము. (ర ర జ ర వ / యతి - 7)

★దండకారణ్యకర్తనా!★ దయానిధీ! హరీ!
నిండుగా గుండెలో నినున్ వహింతు భక్తితోఁ,
బండువై యుండు లోపలన్ బ్రభాకరుండవై
యండవీవే కదా, యజాండ భాస, రాఘవా!

44. ఓం అహల్యాశాపశమనాయ నమః.

కాంత వృత్తము. (య భ న ర స లగ / యతి - 11)

★అహల్యాశాపశమన!★ విమోహమున్ విడఁ జేయుమా,
మహాత్మా! శాపవశుఁడను, రామ నామము పల్క రా
దహో! వాగ్రూపమున, ధన దాహమే విడదేలనో?
స్పృహన్నీవే గొలిపి, నను బ్రోచి నిల్పుము, రాఘవా!

45. ఓం పితృభక్తాయ నమః .

చంద్రశేఖర వృత్తము. (న జ ర జ ర / యతి - 13)

నుత★పితృభక్త!★ రామదేవరా! ఘనుండ! ని
న్నతులితశక్తి పూర్ణ భాగ్యడంచునందురే
క్షితి మతిమంతులున్, మహాత్ములున్, బ్రసిద్ధ! స
ద్వ్రతఫలమీకృతిన్ గనంగ లేవొ? రాఘవా!

46. ఓం వరప్రదాయ నమః .

పుష్పగుచ్ఛ వృత్తము. (జ ర జ గ / యతి - 7)

★వరప్రదా!★ శుభాస్పదా! నతుల్
నిరంతరంబు నిన్నె కొల్చెదన్
పరాత్పరుండ! దైవమీవెరా,
వరప్రదుండ! భవ్య రాఘవా!

47. ఓం జితేంద్రియాయ నమః .

భోగవిలసిత వృత్తము. (భ స జ గ / యతి – 7)

శ్రీకరుఁడ! ★జితేంద్రియా!★ హరీ!
శోకహరుఁడ! నీ శుచిత్వమున్
ప్రాకటముగ భూప! యిమ్మయా,
చీకటులను త్రుంచి రాఘవా!

48. ఓం జితక్రోధాయ నమః.

వంశస్థ వృత్తము. (జ త జ ర / యతి – 8)

హరీ! ★జితక్రోధ!★ యహంబు బాపరా,
పరాత్పరా! భావభవా! కనంగ రా.
ధరాసుతాత్మన్ వినుతా! వసింతువే.
వరంబువై కన్పడు, భవ్య రాఘవా!

49. ఓం జితామిత్రాయ నమః.

నిశ వృత్తము. (న న ర ర ర ర / యతి – 9)

అనుపముఁడవయా, ★జితామిత్ర! ★ నీ సాటి లేరెవ్వరున్,
ఘనతరమగు నీదు కల్యాణ తేజంబు చూడంగనే
మునులకును ప్రమోదమున్ సంతరించున్ గదా శ్రీహరీ!
మనమున ననుఁ గాంచుమా, రామ భూపాల! శ్రీ రాఘవా!

50. ఓం జగద్గురవే నమః .

మత వృత్తము. (న ర న ర / యతి – 7)

కరుణఁ జూడుమా కలుగు మాకిలన్
వరసుభంబులే పరమ పావనా!
నిరతమొందనౌ నిజముగా ★జగ
ద్గురు!★ నుతించు సద్గుణుఁడ! రాఘవా!

51. ఓం ఋక్షవానర సంఘాతినే నమః .

మురళి వృత్తము. (స భ ర ర ర / యతి – 9)

పరమాత్మా! నను౯ జూడవా? ప్రేమగా ★ఋక్షవా
నరసంఘాత!★ మనోజ్ఞ! నాపై సదా ప్రేమతో
కరుణన్ జూడుము, నాయకా! నా యెదన్ నిల్వుమా,
చరణంబుల్ కొలుతున్, నిజంబయ్యరో రాఘవా!

52. ఓం చిత్రకూటసమాశ్రయాయ నమః.

మత్తకోకిల వృత్తము. (ర స జ జ భ ర / యతి – 11)

శ్రీకరుండవు జానకీపతి! ★చిత్రకూటసమాశ్రయా!★
నీకు మ్రొక్కెద నీ ప్రవృత్తిని నేర్పుగా కరుణాకరా!
నాకునొప్పగ వచ్చునట్లు, ఘనంబుగా నొనరింపుమా,
శ్రీకవీశులుశోభ౯గాంచ౯గ౯ జేయుమా శుభ రాఘవా!

53. ఓం జయంతత్రాణవరదాయ నమః.

మణిమంజరి వృత్తము. (య భ న య జ జ గ / యతి – 13)

★జయంత త్రాణవరద!★ జయరామా! జయంబగు నీకు, నీ
ప్రియంబౌ సీతకును, మహిత! దేవేరితో శుభ సంహతిన్
శ్రియానేకంబులను గొలుపుచున్ వాసి జాతికి గొల్పుడీ,
నయాదుల్నాకమర౯గనుడు, మోహన దేహ! రాఘవా!

54. ఓం సుమిత్రాపుత్రసేవితాయ నమః .

ప్రతాపావతారం వృత్తము. (య య ర లగ / యతి – 7)

పునీతా! ★సుమిత్రాపుత్రసేవితా!★
ధనాదుల్ నిజంబా? ధర్మ రక్షకా!
మనోవాంఛలేలో? మంచి చాలదా?
ప్రణామంబు నీకో భవ్య రాఘవా!

55. ఓం సర్వదేవాధిదేవాయ నమః.

నందన వృత్తము. (న జ భ జ ర ర / యతి – 11)

జనకజకాత్మలో నిలిచి, చక్కగాను నీ వుంటివే,
ఘనతను గాంచితే, సుజన గణ్య! ★సర్వదేవాధిదే
వ!★ నను కనంగ లేవుగద? భక్తి గల్గువాడన్ గదా,
ప్రణతులు స్వీకరించు, వర పావనా హరీ! రాఘవా!

56. ఓం మృతవానరజీవనాయ నమః.

మనోజ్ఞ వృత్తము. (న జ జ భ ర / యతి – 10)

హరి! ★మృతవానరజీవనా!★ దురితాపహా!
నరవరుఁడా! శుభసాధనా కుశలా! ప్రశ
స్తరవినుతేజ! ప్రశాంతతన్, వరమీయుమా,
స్మరణము చేసెద నిన్ బ్రశస్తుఁడ! రాఘవా!

57. ఓం మాయామారీచహంత్రేనమః .

కాంచీ వృత్తము. (మ ర భ య ర ర / యతి – 12)

★మాయామారీచహంతా!★ కనఁగ లేమా నిన్ను సర్వేశ్వరా!
మాయామోహాదులే నన్ విడవె? రామా! నన్ను రక్షింపవా?
నీయాజ్ఞన్ నే రచింపంగ కృతి ధన్వీ! సాధ్యమాయెన్, హరీ!
యేయాశల్ లేవయా నాకిలను తండ్రీ! కావుమా రాఘవా!

58. ఓం మహాదేవాయ నమః.

వియోగిని వృత్తము.

(1.3. పాదములందు స స జ గ / యతి – 6.
2.4. పాదములందు స భ ర వ / యతి – 7)

సమయం బిక చాల దో రమే
శ! ★మహాదేవ!★ నిజంబుగా నినున్
ప్రముదంబునఁ బ్రార్థనన్ గనన్
రమణుండా! కనరమ్ము, రాఘవా!

59. ఓం మహాభుజాయ నమః.

ఉజ్జ్వల వృత్తము. (న న భ ర / యతి – 8)

పురుష వర! ★మహాభుజ!★ జానకీ
వరుఁడ! మహిత భావ సుధార్ణవా!
చరణకమల దర్శన మీయరా!
కరుణఁ గనర, మంగళ రాఘవా!

60. ఓం సర్వదేవస్తుతాయనమః.

అంబురుహ వృత్తము. (భ భ భ భ ర స లగ / యతి – 13)

నిస్తుల! పోలరు నిన్నెవరున్ ధర నీరజాక్షుఁడు ★సర్వదే
వస్తుత!★ వందనమందుమ చేసెద బ్రహ్మతేజ పరాత్పరా!
వస్తువులేలను భక్తినొసంగుము వాసవాది సురార్చితా!
ప్రస్తుతమంతయు నీవె యెఱుంగవె? వందనంబులు రాఘవా!

61. ఓం సౌమ్యాయ నమః.

శ్యేని వృత్తము. (ర జ ర వ / యతి – 7)

జ్ఞానరూప! భవ్య! ★సౌమ్య!★ రామయా!
నే నినున్ నుతింతు నిత్యశోభనా!
దీనబాంధవా! సుధీవరాశ్రితా!
కాను శత్రువేను గాంచు రాఘవా!

62. ఓం బ్రహ్మణ్యాయ నమః.

లలితము వృత్తము. (న న మ ర / యతి – 7)

వరదుఁడవయ, ★ బ్రహ్మణ్యా!★ రామయా!
నిరుపముఁడవు, నిన్నే నేఁగొల్చెదన్,
కరుణఁ గనుమ కోదండా హస్తుఁడా!
పరమొసఁగుము ప్రఖ్యాతిన్ రాఘవా!

63. ఓం మునిసంస్తుతాయ నమః.

శుద్ధవిరాటి వృత్తము. (మ స జ గ / యతి – 6)

శాంతంబున్ ★మునిసంస్తుతా!★ సదా
పంతంబొప్పగ వర్ధిలన్, చెడున్,
దాంతంబౌనటు తప్పకన్ హరీ
శాంతిన్ జేయుమ, జ్ఞాన రాఘవా!

64. ఓం మహాయోగినే నమః.

స్రగ్విణి వృత్తము. (ర ర ర ర / యతి –7)

ఓ ★మహాయోగి!★ నీవుండుమా నా మదిన్,
ప్రేమతో నిత్యమున్, విజ్ఞతన్ గొల్పుమా,
నామదిన్ గందు నిన్ నావిభుండంచు నేన్,
క్షేమమున్ గూర్చుమా, శ్రీధరా రాఘవా!

65. ఓం మహోదారాయ నమః .

భిన్నపదము వృత్తము. (భ భ జ గ / యతి – 6)

శ్రీ రఘు రామ! నృహరీ! ★మహో
దార!★ జనస్తుత! శుభాకరా!
చేరెద నిన్ను జిత మానసా!
ధీరుఁడ! పెన్నిధివి రాఘవా!

66. ఓం సుగ్రీవేప్సితరాజ్యదాయ నమః .

శిలీముఖోజ్జృంభితము వృత్తము. (మ స జ న జ త గ / యతి – 13)

★సుగ్రీవేప్సితరాజ్యదా!★ నుతమతి! శుభమ్ములన్ గూర్చుమా,
యగ్రాహ్యంబులు వీడఁజేయుమయ, భయదూర! సద్భక్తిన
త్యగ్రస్థానమునందు మానసమున నజస్రమున్ గొల్చెదన్,
సుగ్రీవున్ దయఁ జూచినట్లు కనుమ సుభద్రుఁడా! రాఘవా!

67. ఓం సర్వపుణ్యాధికఫలాయ నమః.

అవిరళరతికా వృత్తము. (భ న జ ర / యతి - 8)

వ్యాధుల దులుచు మహాత్మ ★సర్వపు
ణ్యాధికఫల!★ శుభదాయి వీవెరా,
బోధఁ గొలుపుమయ పూజ్యపాదుఁడా!
సాధనమగుమయసాధ్య రాఘవా!

68. ఓం స్మృతసర్వాఘనాశనాయ నమః.

ప్రవరవిలసిత వృత్తము. (య మ న న త గ / యతి - 10)

ధనాదుల్ కోరన్ నిన్, సుఫలద! ★స్మృతసర్వాఘనా
శనా!★నా మాటల్ నమ్ముమ, సుచరణ! భాస్వంతుఁడా!
మనంబందున్ నీవేను నిలుమ! శుభ సన్మార్గదా!
జనానీకంబే నిన్ గొలుచు సతతమున్, రాఘవా!

69. ఓం ఆదిపురుషాయ నమః.

కవికంఠభూషణ వృత్తము. (న జ స స న జ గ / యతి - 9)

సరియెవ్వ ★రాదిపురుషా!★ నినుఁ బోలగ నో శుభంకరా!
పరమార్థమున్ గనెడి భాగ్యము! నీ కృపచే గడింపనీ,
శరణాగతుండను, ప్రశాంతిని, ముక్తిని, పొందనిమ్ము నన్,
చరణంబులన్ గొలుతు, చక్కని వాడవటంచు రాఘవా!

70. ఓం పరమపురుషాయ నమః.

తురగము వృత్తము. (న న న న స జ జ గ / యతి - 15)

★పరమపురుష!★ దశరథ సుత! వరభాస్కరాక్షర వంశజా!
నిరుపమమగు వరదుఁడవని, ధరణిన్నినున్ సుజనుల్ సదా
శరణముగనఁగొలుతురుకద, గుణసాంద్ర! కోర్కలు తీర్చవా?
మరువకుమయ, నినుఁగొలిచెడినుతమాన్యులన్గను, రాఘవా!

71. ఓం మహాపురుషాయ నమః.

భూతిలకము వృత్తము. (భ భ ర స జ జ గ / యతి - 12)

జానకి భార్యగ నో ★మహాపురుషా!★ లభించెను గొప్పగా
దీనిధి! కీర్తిని పొందితీవు, నుతింతు నిన్, శుభ పాలకా!
నేను ధరన్ నిను గాంచఁగానగు నీ కృపేక్షణ లేనిచో,
మౌనము వీడుము, రామయా జయమంగళాకర! రాఘవా!

72. ఓం పుణ్యోదయాయ నమః.

గరుడరుతము వృత్తము. (న జ భ జ త గ / యతి - 10)

కనుదును నీదు రూపమె ఘనుండ! ★పుణ్యోదయా!★
వినెదను నీ చరిత్రమె, విశాల ముఖాబ్జుడా!
యనెదను నీదు నామమె, హరీ! యటంచున్ సదా
వినుతులు నీకె చేయుదు, వినంగ శ్రీకరా రాఘవా!

73. ఓం దయాసారాయ నమః.

ప్రముదితవదన వృత్తము. (న న ర ర / యతి - 8)

ధరణిజ నుతతో ★దయాసార!★ నీ
వరయు మధిప! మోహపాశాళి నే
తరుము, పరము నొందగా చేయగా,
కరుణను గను శ్రీకరా! రాఘవా!

74. ఓం పురాణపురుషోత్తమాయ నమః.

వసంతమంజరి వృత్తము. (న భ భ న ర స వ / యతి - 13)

నెపమునెన్నక నన్నిక నిలుపు నిత్యుఁడా మహితా! ★పురా
ణపురుషోత్తమ!★ నీకృపఁ గనిన నాకు ముక్తి సుసాధ్యమౌన్,
కపికుమారుని కాచిన సుజన కల్పవృక్షము నీవయా,
తపన బాపుమ, ముక్తి నొసగుమ, ధర్మ తేజమ! రాఘవా!

75. ఓం స్మితవక్త్రాయ నమః .

మధుర వృత్తము.

1వ పాదమున {ప్రభాత) (న జ జ ర గ / యతి – 8)
2వ పాదమున (అపరాజిత) (న న ర స వ / యతి – 9)
3వ పాదమున (మాలిని) (న న మ య య / యతి – 9)
4వ పాదమున (న స జ జ జ గ, యతి – 9}

వరముగఁ బొందితి భద్రుడా! నినున్ నేన్
స్థిరదుఁడ! కరుణావధీ! ★స్మితవక్త్ర!★ దు
ష్కరమొకొ హరి! నాశ్వాసన్ వసింపంగ నీకున్?
పరమపురుషా! నతుల్ భగవంతుఁడ! రాఘవా!

76. ఓం మితభాషిణే నమః.

ప్రభాకలిత వృత్తము. (న జ జ భ ర స వ / యతి – 13)

సురవినుతా! ★మితభాషి!★ నిన్నిల సుందరా! కననిమ్మురా,
నిరవధికంబుగ నీదు నామమునే బఠించగ చేయుమా,
వరగుణ! జానకి పొంగు నిన్ గని, భక్తులన్ గనువాడివం
చెరయుము నన్నును నీవు ప్రేమగ నచ్యుతా! వర రాఘవా!

77. ఓం పూర్వభాషిణే నమః.

ఉపస్థిత వృత్తము. (త జ జ గ / యతి – 7)

ధీరా! పరమావధి వీవెరా,
శూరా! ననుఁ గాంచుచు ★పూర్వభా
షీ!★ రామ! మదిన్ వసియించుమా,
మారాజ! యశోధన రాఘవా!

78. ఓం రాఘవాయ నమః.

భారతి వృత్తము. (ర)

ఔఘమా!
ఓఘమా!
మేఘమా!
★రాఘవా!★

79. ఓం అనంతగుణగంభీరాయ నమః .

కవికాంత వృత్తము. (భ భ ర న మ స జ గ / యతి – 13)

కామితదాయివిగా,★యనంతగుణగంభీరా!★ నినునాశ్రయింతురే
లేమిని బాధలఁజిక్కువారు, కనలేరే యన్యము నిన్ను మాత్రమే
ప్రేమనుజేరుదురయ్య నీవె కని ప్రీతిన్ గావుము వారినందరిన్,
రామయ!నిన్నునుతించెదన్, శుభద!రమ్యాకారుఁడ!భవ్యరాఘవా!

80. ఓం ధీరోదాత్తగుణోత్తమాయ నమః.

అనవద్యా వృత్తము. (న భ భ మ స లగ / యతి – 10)

స్తిమిత మేదిర దేవర? ★ధీరోదాత్తగుణోత్తమా!★
సుమ సుపేశల దేహుఁడ! శూరాగ్రేశ! నమస్కృతుల్
సముచితంబుగ పాఠక సంస్తుత్యాళి నిల కావరా!
సమధికోన్నతి నిమ్మయ! సంతోషంబుగ రాఘవా!

81. ఓం మాయామానుషచారిత్రాయ నమః .

గగనమణి వృత్తము. (భ మ స భ ర / యతి – 11)

రాముఁడ! ★మాయామానుషచారిత్ర!★ మనోహరా!
నేమము తోడన్ నే తగు రీతి న్విరచించితిన్,
క్షేమము కూర్పన్ శ్రీ శతకంబున్ జిత రూపుఁడా!
నీమహిమంబున్ గాంచుచు శోభాన్విత రాఘవా!

82. ఓం మహాదేవాదిపూజితాయ నమః .

గలితనాలా వృత్తము. (జ భ య ర / యతి – 5)

స్తుతింతు నీశుఁడ! ★మహాదేవాదిపూ
జితా!★ గ్రహించి, నను కాపాడంగ రా,
సతంబు ధ్యాసను నినున్ ధ్యానింతు, జీ
వితాంత మీవె మదినొప్పన్, రాఘవా!

83. ఓం సేతుకృతే నమః.

రుచిరము వృత్తము. (జ భ స జ గ. / యతి 9.)

శ్రితుండ, ★సేతుకృత!★ హరీ! మనోజ్ఞుఁడా!
నితాంతమున్ నినుఁ గననీ! సుపూజితా!
నుతింతు, సేతువయి ననున్ భవంబునే
గతింపఁ జేసెదవు ప్రగణ్య! రాఘవా!

84. ఓం జితవారాశయే నమః .

వనమాలి వృత్తము. (స భ ర లగ/ యతి - 7)

★జితవారాశి!★ వసించుమా! మదిన్,
నుతకీర్తుండ! వినూతనంబుగా
స్తుతమౌ పద్యపు శోభగా నినున్
క్షితిఁ జూపించితి శ్రీద! రాఘవా!

85. ఓం సర్వతీర్థమయాయ నమః .

భద్రకము వృత్తము. (న న ర వ. / యతి – 7)

ప్రముదమిడుమ రామ! ★సర్వతీ
ర్థమయ!★ కని, సుధా నిధానమా!
సుమనసుడ! వసుంధరన్, విశే
షముగ నిడుమ శాంతి, రాఘవా!

86. ఓం హరయే నమః .

సుకాంతి వృత్తము. (జ గ)

★హరీ!★ రమా
ధరా! పరా
త్పరుండ! వీ
వు, రాఘవా!

87. ఓం శ్యామాంగాయ నమః .

పథ్య వృత్తము. (ర య జ గ / యతి – 6)

ధ్యే*య*మీవె శౌరీ! గడింతు నిన్,
మా*య*వీడి రామా! శుభాకరా!
న్యా*య*మార్గమీవయ్య! వీత మో
హా! *య*నంత! ★శ్యామాంగ!★ రాఘవా!

88. ఓం సుందరాయ నమః.

ప్రవష్లిక వృత్తము. (భ జ ర)

*వంద*నము దివ్య ★సుందరా!★
*డెంద*మునసుండుమెప్పుడున్,
కందు నెడబాపు రమేశ!
*కంద*ము సతంబు రాఘవా!

89. ఓం శూరాయ నమః .

పంచచామర వృత్తము. (జ ర జ ర జ గ / యతి - 10)

జ*యం*బు నీకు సంస్తుతుండ! జానకీ మనోహరా!
ప్రి*యం*బుతోడఁ గాంచుమా రవిప్రభాన్వితా హరీ!
న*యం*బుతోడ ★శూర!★ మాకు నవ్యదివ్య మార్గమున్
భ*యా*పహా! కనంగఁ జేసి, భక్తినిమ్ము రాఘవా!

90. ఓం పీతవాససే నమః .

భుజంగసంగత వృత్తము. (స జ ర)

వ*ర*మీవెరా, శుభాకరా!
ని*ర*పాయమార్గ మే సదా
క*రు*ణించి యిమ్ము ★పీతవా
స!★ *ర*మేశ్వరుండ! రాఘవ!

91. ఓం ధనుర్ధరాయ నమః .

విదగ్ధకము వృత్తము. (ర లగ)

ఓ ★ధనుర్ధరా!★
బాధ బాపరా!
శ్రీధరా! రమా
నాథ! రాఘవా!

92. ఓం సర్వయజ్ఞాధిపాయ నమః.

మదన దర్పణ వృత్తము. (భ స జ ర జ గ / యతి – 11)

మాధవ! సురసేవితుండ! క్షేమమిచ్చు సర్వయ
జ్ఞాధిప! నిను నే నుతింతునే, గణించి నన్, గృపన్
బాధలు విడఁ గావుమో పరాత్పరా! రమేశ్వరా!
శోధనలవి యేల? కావగా శుభాక్ష! రాఘవా!

93. ఓం యజ్వినే నమః .

మణిభూషణ వృత్తము. (ర న భ భ ర / యతి – 10)

మంగళాంగుఁడవు! ★యజ్వి!★ సుమంగళ కార్యముల్
రంగుగా నొనరఁజేయు పరాత్పర! నిత్యమున్
బెంగలన్ దులిపి రక్షణ బ్రీతిగ గొల్పుచున్
మంగళంబులిడు రాజువు మాన్యుఁడ! రాఘవా!

94. ఓం జరామరణవర్జితాయ నమః .

హల్లకమాలిక వృత్తము. న న జ స స స జ గ / యతి – 12)

భయమువిడువ ★జరామరణవర్జిత!★చేయుముశాశ్వతంబుగన్
నయముకదురవసింపగ ననంతుఁడ! చేయుము, నిశ్చితంబుగన్,
ప్రియము తలర వచింపగను, విజ్ఞత నొప్పగ భాసురంబుగన్
జయద! కృపఁగని చేయర, విశాల సునేత్రుఁడ! దివ్య రాఘవా!

95. ఓం విభీషణప్రతిష్ఠాత్రే నమః .

లలిత వృత్తము. (త భ జ ర / యతి – 9)

జ్ఞానీ! ★విభీషణ ప్రతిష్ఠ!★ రామయా!
జ్ఞానార్థి నిన్ దెలియు మార్గ మారయన్
నీ నామకీర్తనలనే నిరామయా!
మౌనంబుతో సలుపు, రామ రాఘవా!

96. ఓం సర్వావగుణవర్జితాయ నమః .

మత్తహంసిని వృత్తము. (జ త స జ గ / యతి – 12)

గుణాఢ్య! ★సర్వావగుణవర్జితా!★ హరీ!
ప్రణామమో శ్రీకర! నవాంబుజాక్షుఁడా!
గణింపుమా మానక కవిత్వ సంపదన్,
గుణంబులన్ మానకు గణింపు, రాఘవా!

97. ఓం పరమాత్మనే నమః .

డిండిమ వృత్తము. (జ స న జ ర / యతి – 11)

జయంబు ★పరమాత్మ!★ నుత విశాలనేత్రుఁడా!
జయంబు శుభసంయుత! గుణసాంద్ర! సత్ప్రభా!
జయంబగుత నీదు సతి ప్రశస్త సీతకున్,
జయంబు ప్రియభక్తులకును, సౌమ్య! రాఘవా!

98. ఓం పరస్మైబ్రహ్మణే నమః.

ఖచరప్లుతము వృత్తము. (న భ భ మ స స వ / యతి – 12)

పరమపావన నామ! ★పరస్మైబ్రహ్మ!★ శుభాకర! రామయా!
కరుణఁ జూపర, సన్నుతుఁడా! శ్రీకామిత దాయివి, నీవెగా,
స్థిరము నా మదికిన్ దయనిమ్మా, చిద్విభవా! కరుణామయా!
భరము కాదుర నీకిది, నా దేవా! దయఁ జూడర, రాఘవా!

99. ఓం సచ్చిదానందవిగ్రహాయ నమః .

తనుమధ్యమా వృత్తము. (య మ య న ర ర / యతి – 1, 8,15)

అహం బీ నాలో నిల్చెరా! దేవ! వర ★సచ్చిదానందవి
గ్రహా!★ నన్నున్గానంగ రా, నీవె యహమున్ దురంబౌనటుల్
స్పృహన్ నీవే నాకున్ హరీ! కొల్పి, మదిలోఁజెరీ పాపరా!
సహాయంబున్ జేయన్ వశంబై, నిలుము ధీవశా! రాఘవా!

100. పరస్మైజ్యోతిషే నమః .

హరనర్తనము వృత్తము. (ర స జ య భ ర / యతి – 9)

దీనరక్షక! దేవ! ధాత్రి ★పరస్మైజ్యోతి!★ రమాపతీ!
జ్ఞానదుండవు, నీవు కాక పరంబున్ గొల్పగ లేరుగా,
ప్రాణమీవెగ? నన్నుఁ బ్రోవవ? సర్వజ్ఞా! నతులందుమా,
నేను వ్రాసిన పద్యముల్ నెటి, సంతోషించుము, రాఘవా!

101. ఓం పరస్మై ధామ్నే నమః .

దీపకమాల వృత్తము. (భ మ జ గ / యతి – 7)

మాన్య! ★పరస్మై ధామ!★ సన్నుతుల్
ధాన్యము, సద్దనాల్ ఘనంబుగా
ధన్యత గొల్పంగా దయాంబుధీ!
గణ్యతనిమ్మొప్పంగ, రాఘవా!

102. ఓం పరాకాశాయ నమః .

నందిని వృత్తము. (స జ స ర వ / యతి – 7)

కరుణించు నాయక! ★పరాకాశ!★ మాధవా!
ధరజాపతీ ముదము గాచూడు! కేశవా
పరమీయుమీవె పరమార్థంబు నీవెరా
వరమీవె నా కపర దైవంబ! రాఘవా!

103. ఓం పరాత్పరాయ నమః .

అభ్రక వృత్తము (త భ జ జ గ / యతి 9)

దీనాళిఁ గాచెడు సుధాబ్ధి! ★పరాత్పరా!★
మా నాయకుండ! మము ప్రేమను గాంచుమా,
మా నోట నీదయిన నామము పల్కనీ,
నీ నామ మేప్రణవ మెన్నిన రాఘవా!

104. ఓం పరేశాయ నమః .

పద్మకము వృత్తము. (న భ జ జ జ గ / యతి - 11)

వర★పరేశ!★ నినుఁ జూచెడి భాగ్యము కల్గునా?
పరముపొందెడి మహాద్భుత భక్తినినిత్తువా?
చరణ సేవలను చేసెడి సద్వరమిత్తువా?
పరమపావన! శుభాకర! సర్వగ రాఘవా!

105. ఓం పారగాయ నమః.

మంజుభాషిణి వృత్తము. (స జ స జ గ / యతి - 9)

విను ★పారగా!★ ధనము వెల్లువై ప్రజన్
మనునట్లుగా గనుత మంగళాంగుఁడా!
వినయంబునే గొలిపి వెల్గ జేయుమా,
నిను నేను కోరుదిదె నిత్య రాఘవా!

106.ఓం పారాయ నమః.

స్త్రీ వృత్తము . (త గ)

★పారా!★ నతుల్,
నా రక్ష నీ
వేరా సదా,
శ్రీ రాఘవా!

107. ఓం సర్వదేవాత్మకాయ నమః .

మహాలక్ష్మి వృత్తము. (ర ర ర)

రక్షకా! ★సర్వదేవాత్మకా!★
శిక్షణన్ గొల్పుమా భక్తినే
నక్షయంబో విధిన్ నేర్వగన్,
అక్షరాకారుఁడా! రాఘవా!

108. ఓం పరస్మై నమః .

కలహంస వృత్తము. (స లగ)

క*రుణాక* రా
క్ష*ర!* నీకగున్
★ప*ర!*★ మంగళ
మ్ము*ర* రాఘవా!

వేడుకోలు.

కం. రామాష్టోత్తరశత మిది
భూమిన్ భవ తాప హరము పుణ్యప్రదమున్,
శ్రీమంతంబును, చదువుడు,
ధీమంతులు మూడుపూట్ల దీపిత భక్తిన్.

ఫలశ్రుతి.

కం. నూటెనిమిది ఛందమ్ముల
నూటెనిమిది నామములకనూనసుభక్తిన్,
బాటించి వ్రాసినాడను,
ధాటికపఠియింప పుణ్యదంబగు ధరణిన్.

స్వస్తి

శ్రీమన్మంగళ కౌశిక గోత్ర చింతా వంశ జానకీ రామమూర్తుల పౌత్రుండును,
పవిత్ర చరితులగు వేంకటరత్నమాంబా సన్యాసిరామారావుల పుత్రుండును,
శ్రీమత్కల్పపూడి వేంకట వీర రాఘవాచార్యులవారి ప్రియ శిష్యుండును,
శ్రీమాతా కరుణామృతపాన లోలుండును, కవికల్పభూజాద్యనేక
బిరుదాంకితుండును, అగు
రామకృష్ణారావుచే ప్రణీతంబయిన
అష్టోత్తరశత నామాంచిత అష్టోత్తరశతచ్ఛంద రాఘవ శతకము సంపూర్ణమ్.

o O o



రాఘవశతకము

అక్షరక్రమంలో వృత్తముల, రాఘవ నామముల పట్టిక.

1. **అంగజాస్త్రము.** (1, 2 పాదములకు భ మ స గ / యతి - 6, 3, 4 పాదములకు మ స జ గ / యతి - 6) 7. ఓం రాజేంద్రాయ నమః

2. **అంబురుహ.** (భ భ భ భ ర స లగ / యతి - 13) 60. ఓం సర్వదేవస్తుతాయనమః.

3. **అనవద్యా.** (న భ భ మ స లగ / యతి - 10) 80. ఓం ధీరోదాత్తగుణోత్తమాయ నమః.

4. **అపరాజిత.** (న న ర స వ / యతి - 9) 8. ఓం రఘు పుంగవాయ నమః

5. **అభ్రక.** (త భ జ జ గ / యతి 9) 103. ఓం పరాత్పరాయ నమః

6. **అవిరళరతికా.** (భనజ ర / యతి - 8) 67. ఓం సర్వపుణ్యాధికఫలాయ నమః.

7. **ఇంద్రవంశము.** (త త జ ర / యతి - 8) 19. ఓం సత్యవిక్రమాయ నమః.

8. **ఉజ్జ్వల.** (న న భ ర / యతి - 8) 59. ఓం మహాభుజాయ నమః.

9. **ఉత్పలమాల.** (భ ర న భ భ ర వ/యతి - 0) 37. ఓం త్రిగుణాత్మకాయ నమః.

10. **ఉత్సుకము.** (భ భ ర) 4. ఓం శాశ్వతాయ నమః.

11. **ఉపమాలిని.** (న న త భ ర / యతి - 9) 27. ఓం హరకోదండ ఖండనాయ నమః.

12. **ఉపస్థిత.** (త జ జ గ / యతి - 7) 77. ఓం పూర్వభాషిణే నమః.

13. **కదంబ మంజరీ.** (జ ర ర జ జ గ / యతి - 9) 12. ఓం జనార్ధనాయ నమః.

14. **కరపల్లవోద్రతా.** (య య స జ గ. యతి 7.) 29. ఓం దశగ్రీవశిరోహరాయ నమః.

15. **కరశయాకిశోరము**. (న భ ర) 38. ఓం త్రివిక్రమాయై నమః.

16. **కలహంస.** (స లగ) 108. ఓం పరస్మై నమః

17. **కళాధర.** (ర ర జ ర వ/యతి – 7) 43. దండకారణ్యకర్తనాయ నమః.

18. **కవికంఠభూషణము**. (న జ స స న జ గ / యతి – 9) 69.
ఓం ఆదిపురుషాయ నమః.

19. **కవికాంత**. (భ భ ర న మ స జ గ / యతి – 13) 79.
ఓం అనంతగుణగంభీరాయ నమః

20. **కాంచీ**. (మ ర భ య ర ర / యతి – 12) 57.
ఓం మాయామారీచహంత్రే.

21. **కాంత**. (య భ న ర స లగ / యతి – 11) 44.
ఓం అహల్యాశాపశమనాయ నమః.

22. **కుంజ** (త జ ర స ర. యతి 9) 35. ఓం దూషణత్రిశిరోహంత్రే నమః.

23. **కుటజగతి**. (న జ మ త గ/యతి – 9) 32. ఓం వేదాంతసారాయ నమః.

24. **కుసుమిత**. (న ర ర) 39. ఓం త్రిలోకాత్మనే నమః.

25. **కౌముది**. (న త త గ / యతి – 6) 6. ఓం శ్రీమతేనమః

26. **క్షమ, (క్షప).** (న న త త గ / యతి – 8) 10. ఓం జైత్రాయ నమః.

27. **ఖచరప్లుతము**. (న భ భ మ స స వ / యతి – 12) 98.
ఓం పరస్మైబ్రహ్మణే నమః.

28. **గగనమణి.** (భ మ స భ ర/యతి – 11) 81.
ఓం మాయామానుషచారిత్రాయ నమః

29. **గరుడరుతము.** (న జ భ జ త గ/యతి – 10) 72. ఓం పుణ్యోదయాయ నమః.

30. **గౌరీ.** (ననరర/ యతి – 8) 28. ఓం సప్తతాళప్రభేత్రే నమః.

31. **గలితనాలా.** (జభయర/యతి–5) 82. ఓంమహాదేవాదిపూజితాయ నమః

32. **చంద్రశేఖర.** (న జ ర జ ర/యతి – 13) 45. ఓం పితృభక్తాయ నమః

33. **చంద్రిక,(భద్రిక).** (న న ర వ / యతి – 9) 36. ఓం త్రిమూర్తయే నమః

34. **చంపకమాల.** (న జ భ జ జ జ ర / యతి – 11) 25.
ఓం విరాధవధపండితాయనమః.

35, **చంపకకేసరి.** (స జ స స స వ/యతి – 9) 41. ఓం త్రిలోక రక్షకాయ నమః.

36. **చారుహాసికి.** (ప్రవర్తిక-పరాంతిక). (1వ పాదమున- న న ర వ/యతి – 6,
2వ పాదమున- స భ ర వ / యతి – 7,
3వ పాదమున- న ర జ గ / యతి – 5,
4వ పాదమున స ర ర వ / యతి – 6) 11.
ఓం జితామిత్రాయ నమః.

37. **డిండిమ.** (జ స న జ ర/యతి – 11) 97. ఓం పరమాత్మనే నమః

38. **తనుమధ్యమా.** (య మ య న ర ర / యతి – 1, 8,15) 99.
ఓం సచ్చిదానందవిగ్రహాయ నమః

39. **తురగము.** (న న న న స జ జ గ / యతి – 15) 70.
ఓం పరమపురుషాయ నమః.

40 **దర్పనాశిని.** (న ర స భ స వ / యతి – 10) 30.
ఓం జామదగ్న్య మహాదర్పదళనాయ నమః.

41. **దీపకమాల.** (భ మ జ గ/యతి – 7) 101. ఓం పరస్మైధామ్నే నమః

42. **ద్రుతవిలంబితము.** (న భ భ ర/యతి – 7) 23. ఓం కౌసలేయాయ నమః.

43. **నందనము .** (న జ భ జ ర ర/యతి – 11) 55.
ఓం సర్వదేవాధిదేవాయ నమః.

44. **నందిని.** (స జ స ర వ/యతి – 7) 102. ఓం పరాకాశాయ నమః

45. **నదీప్రఘోషము.** (1వ పాదమున స్రగ్విణి – ర ర ర ర / యతి – 7
2వ పాదమున వంశస్థ – జ త జ ర / యతి – 8
3వ పాదమున భుజంగప్రయాత – య య య య/యతి – 8
4వ పాదమున ఇంద్రవంశ – త త జ ర/యతి – 8) 9.
ఓం జానకీవల్లభాయ నమః

46. **నాగరము.** (భ ర వ) 17. ఓం వాఙ్మినే నమః

47. **నారాచము.** (త ర వ) 5. ఓం రాజీవలోచనాయ నమః

48. **నిశ.** (న న ర ర ర ర/యతి – 9) 49. ఓం జితామిత్రాయ నమః.

49. **పంచచామరము.** (జ ర జ ర జ గ/యతి – 10) 89. ఓం శూరాయ నమః

50. **పథ్య.** (ర య జ గ/యతి – 6) 87. ఓం శ్యామాంగాయ నమః

51. పద్మకము. (న భ జ జ జ గ/యతి – 11) 104. ఓం పరేశాయ నమః

52. **పుష్పగుచ్ఛము.** (జ ర జ గ/యతి – 7) 46. ఓం వరప్రదాయ నమః

53. **పృథ్వి.** (జ స జ స య లగ / యతి –12) 40.
ఓం పుణ్యచారిత్రకీర్తనాయ నమః.

54. **ప్రతాపావతారం.** (యయరలగ /యతి–7) 54. ఓం సుమిత్రాపుత్రసేవితాయ నమః
.
55. **ప్రభాకలిత.** (న జ జ భ ర స వ/యతి – 13) 76. ఓం మితభాషిణే నమః.

56. **ప్రమాణి.** (జ ర వ) 14. ఓం దాంతాయై నమః

57. **ప్రముదితవదన.** (న న ర ర / యతి - 8) 73. ఓం దయాసారాయ నమః.

58. **ప్రవరవిలసితము.** (య మ న న త గ / యతి - 10) 68.
ఓం స్మృతసర్వాఘనాశనాయ నమః.

59. **ప్రవర్షిక.** (భ జ ర) 88. ఓం సుందరాయ నమః.

60. **ప్రియంవద.** (న భ జ ర/యతి - 8) 22. ఓం సదా హనుమదాశ్రితాయ నమః.

61. **భద్రకము.** (న న ర వ./యతి - 7) 85. ఓం సర్వతీర్థమయాయ నమః

62. **భారతి.** (ర) 78. ఓం రాఘవాయ నమః.

63. **భిన్నపదము.** (భ భ జ గ / యతి - 6) 65. ఓం మహోదారాయ నమః

64. **భుజంగవిజృంభితము.** (మ మ త న న న ర స వ / యతి –9, 19) 16.
ఓం వాలిప్రమథనాయ నమః

65. **భుజంగసంగత.** (స జ ర) 90. ఓం పీతవాససే నమః

66. **భూతిలకము.** (భ భ ర స జ జ గ/యతి - 12) 71. ఓం మహాపురుషాయ నమః.

67. **భోగవిలసిత.** (భ స జ గ / యతి - 7) 47. ఓం జితేంద్రియాయ నమః

68. **మంజరి.** (స జ స య ల గ/యతి - 9) 20. ఓం సత్యవ్రతాయ నమః.

69. **మంజుభాషిణి.** (స జ స జ గ/యతి - 9) 105. ఓం పారగాయ నమః.

70. **మణిభూషణము.** (ర న భ భ ర / యతి - 10) 93. ఓం యజ్వనే నమః

71. **మణిమంజరి.** (య భ న య జ జ గ / యతి - 13) 53.
ఓం జయంతత్రాణవరదాయ నమః.

72. **మత**. (న ర న ర / యతి - 7)50. ఓం జగద్గురవే నమః

73. **మత్తకోకిల**. (ర స జ జ భ ర / యతి - 11) 52.
ఓం చిత్రకూటసమాశ్రయాయ నమః.

74.**మత్తహంసిని**. (జతసజగ/యతి - 12) 96.ఓంసర్వావగుణవర్జితాయ నమః

75.**మత్తేభము**. (సభరనమయవ/యతి - 14) 26.ఓం విభీషణ పరిత్రాత్రే నమః.

76. **మదన దర్పణము**. (భ స జ ర జ గ / యతి - 11) 92.
ఓం సర్వయజ్ఞాధిపాయ నమః.

77. **మధుర**. 1వ పాదమున {ప్రభాత) (న జ జ ర గ / యతి - 8)
2వ పాదమున (అపరాజిత) (న న ర స వ / యతి - 9)
3వ పాదమున (మాలిని) (న న మ య య/ యతి - 9)
4వ పాదమున (న స జ జ జ గ, యతి - 9}75.
ఓం స్మితవక్త్రాయ నమః

78. **మనోజ్ఞ**. (నజజభర/యతి - 10) 56.ఓం మృతవానరజీవనాయ నమః.

79. **మనోరమ**. (న ర జ గ/ యతి - 7) 31. ఓం తాటకాంతకాయ నమః.

80. **మనోహర**. (ర జ ర జ గ / యతి - 9) 42. ఓం ధన్వినే నమః.

81. **మురళి**. (సభరరర/యతి - 9)51.ఓంబుక్షవానరసంఘాలినే నమః

82. **మహాలక్ష్మి**. (ర ర ర) 107. ఓం సర్వదేవాత్మకాయ నమః

83. **మృత్యుంజయ**. (త మ లగ) 24. ఓం ఖరధ్వంసినే నమః.

84.**రథోద్ధతము**. (రనరవ/యతి - 7) 34.ఓం భవరోగస్యభేషజాయ నమః.

85.**రసోదత**. (తజభతర/యతి - 7) 15.ఓం శరణత్రాణ తత్పరాయ నమః.

86. **రుచిరము.** (జ భ స జ గ./యతి 9.) 83. ఓం సేతుకృతే నమః.

87. **లత.** (ర య లగ) 33. ఓం వేదాత్మనే నమః.

88. **లలిత.** (త భ జ ర/యతి – 9) 95. ఓం విభీషణప్రతిష్ఠాత్రే నమః

89. **లలితము.** (న న మ ర/యతి – 7) 62. ఓం బ్రహ్మణ్యాయ నమః.

90. **వంశస్థము.** (జ త జ ర/యతి – 8) 48. ఓం జితక్రోధాయ నమః.

91. **వనమాలి.** (స భ ర లగ /యతి – 7) 84. ఓం జితవారాశయే నమః

92. **వల్లరి.** (ర ర) 18. ఓం సత్యవాచేనమః

93. **వసంతమంజరి.** (న భ భ న ర స వ / యతి – 13) 74.
ఓం పురాణపురుషోత్తమాయ నమః.

94. **విదగ్ధకము.** (ర లగ) 91. ఓం ధనుర్ధరాయ నమః

95. **విభూతి.** (ర జ గ) 3. ఓ౮ రామచంద్రాయ నమః.

96. **వియోగిని.** (1.3. పాదములందు స స జ గ / యతి – 6.
2.4. పాదములందు స భ ర వ / యతి – 7) 58.
ఓం మహాదేవాయ నమః.

97. **వ్రీళ .** (త గ) 106.పారాయ నమః.

98. **శార్దూలవిక్రీడితము.** (మ స జ స జ త త గ/యతి – 13) 1 శ్రీరామాయనమః.

99. **శిలీముఖోజ్జృంభితము.** (మ స జ న జ త గ / యతి – 13) 66.
ఓం సుగ్రీవేప్సితరాజ్యదాయ నమః

100. **శుద్ధవిరాటి.** (మ స జ గ/యతి – 6) 63. ఓం మునిసంస్తుతాయ నమః.

101. **శ్యేని.** (ర జ ర వ/యతి - 7) 61. ఓం సౌమ్యాయ నమః.

102. **సుకాంతి.** (జ గ) 86. ఓం హరయే నమః

103. **సుగంధి.** (7 హ గణములు ఒక గురువు /యతి - 9.)
2. ఓం శ్రీరామభద్రాయ నమః.

104. **సుధాధామ.** (న త గ) 21. ఓం వ్రతధరాయ నమః.

105. **స్రగ్విణి.** (ర ర ర ర/యతి - 7) 64. ఓం మహాయోగినే నమః.

106. **హల్లకమాలిక.** (న న జ స స స జ గ/యతి - 12) 94.
ఓం జరామరణవర్జితాయ నమః

107. **హరనర్తనము.** (ర స జ య భ ర/యతి - 9) 100, పరస్మైజ్యోతిషే నమః

108. **హరిణి.** (న న మ ర స ల గ/యతి - 10) 13.
ఓం విశ్వామిత్రప్రియాయై నమః

అంకితము

ఈ శతకమును వ్రాయుటకు ప్రేరణ కలిగించిన
బ్రహ్మశ్రీ ఊలపల్లి సాంబశివరావు మహోదయ దంపతులకు

శా. శ్రీమన్మంగళ రామచంద్ర విభుడే సీతా సమేతంబుగా
ధీమంతుండగు సాంబుడై, లలితయై దీపించిరీ జంటగా
ప్రేమన్ వీరికి రాఘువాఖ్య శతకంబే యంకితం బిచ్చితిన్,
శ్రీమత్సీతయు రాముడీ మహితులన్ క్షేమంబుగా చూచుతన్.

చింతా రామకృష్ణారావు

“

రచయిత

చింతా రామకృష్ణారావు

విద్యార్హతలు: P.O.L., M.A., భాషాప్రవీణ

వృత్తి: విశ్రాంత ఆంధ్రోపన్యాసకుఁడు

నివాసం: మియాపూర్, హైదరాబాద్

బిరుదులు: చిత్రకవితాసమ్రాట్., కవికల్పభూజ., పద్యకవితాభిరామ, చిత్రకవితా సహస్రఫణి, పుంభావ భారతీ,

రచనలు: ఇప్పటి వరకు చేసిన 41 రచనల పూర్తి వివరాలు 54, 55 పేజీలలో యివ్వబడినవి.

చరవాణి: 8247384165

చిరునామా: ఫ్లాట్ నెం. A 601. శిల్పాస్ ఆర్వీధర్మిష్ఠ, డీమార్టుకు ఎదురుగా.. మియాపూర్, హైదరాబాద్. 49.
తెలంగాణా. భారత దేశము